# 19000 దాటితే మరింత ఉత్సాహం

**గతవారం:** ప్రధాన షేర్లలో కొనుగోళ్లు పెరగడంతో మార్కెట్ దూసుకెళ్లింది. 31 నెలల గరిష్ఠ స్థాయిలను తాకింది. అటు ఎఫ్ఐఐలు, ఇటు మ్యూచువల్ ఫండ్లు ఉత్సాహం చూపడంతో సెన్సెక్స్ గతవారం 579 పాయింట్లు లాభపడింది.

అమెరికాలో నిరుద్యోగ గణాంకాలు అంచనాల కంటే తక్కువగా నమోదు కావడం సెంటిమెంటును పెంచింది. మార్కెట్‌కు మంచి ప్రారంభాన్ని ఇచ్చింది. మరో పక్క ప్రత్యక్ష పన్ను వసూళ్ల పెరుగుదల, కొనసాగుతున్న విదేశీ సంస్థాగత మదుపుదార్ల(ఎఫ్ఐఐ) ధోరణి కూడా మదుపర్ల జోరును రెట్టింపు చేసింది. ఆహార ద్రవ్యోల్బణం 11.47 శాతానికి పెరిగినా అధిక స్థాయిల వద్ద సెన్సెక్స్ కొనసాగింది.

**ఎఫ్ఐఐల తీరు:** ఎఫ్ఐఐలు రూ. 2,190 కోట్ల నికర కొనుగోళ్లు చేయగా.. చాలా వారాల విక్రయాల తర్వాత మ్యూచువల్ ఫండ్లు రూ. 451 కోట్ల నికర కొనుగోళ్లు చేయడం విశేషం.

**రంగాల వారీగా:** చైనా వృద్ధికి తోడు ప్రపంచ మార్కెట్లలో లోహ ధరలు పెరగడం లోహ షేర్లలో ర్యాలీకి దారితీసింది. బ్యాంకింగ్ షేర్లు కూడా మదుపర్లను ఆకర్షించాయి. అంతర్జాతీయ మార్కెట్లలో సెంటిమెంటు మెరుగుపడడంతో ఐటీ షేర్లు రాణించాయి. అయితే ఎఫ్ఎమ్‌సీజీ, ఆరోగ్య సంరక్షణ, మన్నికైన వినిమయ వస్తువుల షేర్లు మాత్రం డీలా పడ్డాయి.

లాభపడ్డ, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 5:4గా నమోదుకావడం చూస్తే ఎంపిక చేసిన షేర్లలో కదలికలు కొనసాగాయని అర్థమవుతోంది.

**ఈ వారంపై అంచనాలు:** మధ్య కాలంలో 19000 స్థాయినీ అధిగమించొచ్చన్న సంకేతాలు కనిపిస్తున్నాయి. తక్షణ నిరోధం 19000 వద్దే ఉంది. ఈ స్థాయి కంటే పైన మార్కెట్ ముగిసినట్లయితే మధ్యకాలానికి అధికస్థాయిలకు వెళుతుందని అంచనా వేయొచ్చు.

**ప్రభావితం చేసే అంశాలు:** సానుకూల ప్రపంచ మార్కెట్ల గమనం, ఎఫ్ఐఐల ధోరణి మధ్యకాలానికి మార్కెట్ కదలికలనునిర్దేశించొచ్చు. ఐఐపీ గణాంకాలు మెరుగ్గా రాణించిన నేపథ్యంలో మంగళవారం విడుదల కానున్న ద్రవ్యోల్బణ గణాంకాలు పెరిగితే కనుక 16న జరగనున్న ఆర్‌బీఐ సమీక్షలో వడ్డీ రేట్లు పెరగడానికి అవకాశం ఉంటుంది. అదే జరిగితే వచ్చే కొద్ది వారాలు వడ్డీ రేట్లతో ప్రభావితమయ్యే రంగాలు వెలుగులోకి రావచ్చు. కార్పొరేట్ల ముందస్తు పన్ను గణాంకాలు ఎంపిక చేసిన షేర్లపై ప్రభావం చూపవచ్చు.




**తక్షణ మద్దతు స్థాయిలు:** 18669, 18540, 18452; **తక్షణ నిరోధ స్థాయిలు:** 19000, 19177, 19291

**మార్కెట్ 19000 స్థాయిని దాటితే ర్యాలీలో మరింత ఉత్సాహం కనిపించవచ్చు.**

– సతీశ్ కంతేటి, జెన్ సెక్యూరిటీస్